ఓంశ్రీసాయిరాం

*పనిపాటలందె మీ బ్రతుకంత తెల్లారె*
*ఇదియె జీవితమని ఎంచినార*
*మూడు పూటలు మీరు భుజియించి తృప్తిగా*
*ఇదియె జీవితమని ఎంచినార*
*అలసటదీరగా హాయిగా నిదురించి*
*ఇదియె జీవితమని ఎంచినార*
*కాదు జీవిత రహస్యమెరుగు కొరకు*
*ఇందుకే దేవుడు నిచ్చె జన్మ*
*తెలివితేటలు కల్గియు తెలిసికొనక*
*కాలమంతయు నూరక గడుపనేల?*
*మనిషిగా మీరలికనైన మసలరయ్య*
*ఇంతకన్నను వేరెద్ది ఎరుక పరతు.*

జిహ్వే రసజ్ఞే మధుర ప్రియే త్వం సత్యం హితం త్వాం పరమం వదామి
ఆవర్తయ త్వం మధురాక్షరాణి గోవింద దామోదర మాధవేతి.

ప్రేమస్వరూపులారా!

వాక్కుచేతనే రాజ్యములను, సంపదలను పొందవచ్చును. వాక్కుచేతనే మిత్రులను, బంధువులను అనేకరీతులుగా సంబంధముగావించుకోవచ్చును. వాక్కుచేతనే మనము బంధితులైపోతున్నాము. పరాధీనులైపోతున్నాము. స్వాతంత్ర్యమును పోగొట్టుకొంటున్నాము. మరణముకూడా వాక్కుచేతనే సంభవిస్తున్నది. వాక్కే మానవునికి ప్రాణము. వాక్కే జీవితమునకు వెన్నెముక. వాక్కు మహత్తరమైన శక్తి కలది. ఓ నాలుకా! మధురమైన రసము కలిగినదానవు నీవు. చాలా ప్రియమైన దానవు నీవు. సత్యమును హితముగను, మితముగను పలికే దానవు. ఓ నాలుకా! నీవు పరదూషణయందుగాని, పరవిమర్శలయందుగాని, పరులను హాస్యాస్పదముగా వించుటయందుగాని ప్రవేశించకూడదు. దివ్యమైన, మధురమైన భగవన్నామాన్ని చక్కగా స్మరించు. భగవన్నామాన్ని పరులకు తెలిపించు, మంచిమాటలాడు. మధురమైన మాటలాడు. ఉద్రేకముగా మాట్లాడకు. హితముగా, సత్యముగా, మితముగా నీవు మాట్లాడు. దురదృష్టవశాత్తు ఈనాడు అట్టి మధురమైన, దివ్యమైన, భవ్యమైన, నవ్యమైన వాక్కులు కోల్పోవటం చేత ఈనాటి సమాజము అస్తవ్యస్తమై అశాంతికి నిలయమై సమాజమును సతమతము చేయుచున్నది. పెచ్చుపెరిగిన నాగరికత వల్ల హద్దుమీరి, నీతి నియమాలను మంటగలిపి ఈనాడు సమాజము కేవలము ఒక చిన్న అగ్నిగోళముగా మారుతున్నది. ఈనాటి సమాజములో అనేకరూపములుగా, అనేకరీతులుగా దీన్ని ఛిన్నా భిన్నముచేసి ఐకమత్యమును కోల్పోయి,అనైక్యతను పెంచి సమాజము అశాంతికి గురౌతున్నాది. కులమతముల భేదముచేత, ప్రాంతీయ దురభిమానములచేత, అనేకరకములైన వాంఛలచేత ఘర్షణ, రక్తపాతముచేత సమాజమును కేవలము శ్మశానముగా మారుస్తున్నది. ఈనాటి మానవత్వము నిత్యసత్యమైన తత్త్వమును విస్మరించి అనిత్యము, అస్థిరము, అసత్యమైన భోగభాగ్యములనాశించి కేవలము ప్రాకృతమైన జీవితములో శాంతి లేకుండా జీవిస్తున్నాడు. మానవుడు భౌతికంగా, వైజ్ఞానికంగా ఎంతో ప్రగతిని సాధించాడు. కాని, నైతికంగా క్షుద్రవిమర్శలచేత, కేవలము అసూయాసంపత్తికూడిన మాటల చేత మానవులను బాధించి, తన స్వార్థస్వప్రయోజనముల నిమిత్తమై తన జీవితమును వ్యర్థము చేసుకొనుచున్నాడు. మానవుడు దేనిని ప్రేమించినా తన స్వార్థము నిమిత్తము ప్రేమిస్తున్నాడు. వస్తు నిమిత్తమై వస్తువులను ప్రేమించటం లేదు మానవుడు. తన నిమిత్తమై వస్తువులను ప్రేమిస్తున్నాడు. ఆలుబిడ్డలు, తల్లిదండ్రులను సహితము తన నిమిత్తము ప్రేమిస్తున్నాడేగానీ ఆలుబిడ్డల నిమిత్తము, తల్లిదండ్రుల నిమిత్తము వారిని ప్రేమించటం లేదు. సర్వత్రా స్వప్రయోజనమే తాండవించుచున్నది. ఏది తలచినా, ఏది చేసినా, ఏది చెప్పినా, ఏది విన్నా అన్నింటి వెనుక స్వార్థము కదలుతూనే వున్నది. ఈనాటి మానవుడు స్వార్థమునకు సేవకుడై స్వార్థము చేతిలో కీలుబొమ్మవలె వున్నాడు. స్వార్థమే లేకుండిన, స్వప్రయోజనమే లేకుండిన అడుగైనా ముందుకు వేయలేదు. ఈనాడు సాంకేతిక విజ్ఞాన శాస్త్రము విరివిగా పెరిగినది. ఎలక్ట్రానిక్స్, కంప్యూటర్స్, ప్లాస్టిక్స్ అనేవాటివల్ల అద్భుతమైన శక్తులను సాధిస్తున్నారు. అణుశక్తిచేత అనేక యంత్రములను సృష్టించి మహావిచిత్రమైన రూపములను ధరిస్తున్నాయి. అంతరిక్షములో విజయాన్ని సాధిస్తున్నాడు. మరొకవైపున రాజకీయ కల్లోలము. కులమత ప్రాంతీయదురభిమానములు. విద్యార్థుల అల్ల కల్లోలములు. ఈవిధముగా పరస్పరవిరుద్ధమైన రెండింటి అభివృద్ధులకు మూలకారణమేమని విచారించాలి. ఈనాటి మానవునియందు నైతికవిలువ క్షణక్షణమునకు దిగజారిపోతున్నది. నైతిక, ధార్మిక,

ఆధ్యాత్మికములకు మానవుని భావము అతి ఘోరంగా మారిపోవుచున్నది.

సకల శాస్త్రపురాణముల చదివిన పండితుడుకూడను, సత్యధర్మములు ప్రచారముగావించే మహనీయులుకూడను ఈ సంకుచిత హృదయముచేత అనేక వాదోపవాదములకు, కలహములకు కాలుదువ్వుచున్నారు. ఇట్టి ఘనులైనవారియందుకూడను, విద్యావంతు లైనవారియందుకూడను, వివేకవంతులైనవారియందుకూడను, మేధావంతులైనవారియందుకూడను ఈ సంకుచితమైన భావములు ఆవిర్భవించి నా మతము, నా సిద్ధాంతము, నా గురువు అనే భేదములచేత జగత్తునందున్న ఏకత్వమును భిన్నత్వముగా చేస్తున్నారు. ఏకత్వమును అనేకత్వముగా విభజించే ఘనులు,మేధావులు అభివృద్ధి అవుతున్నారేగాని, అనేకత్వములోని ఏకత్వమును గుర్తించే పవిత్రులు ఈనాడు జగత్తులో కానరావటం లేదు. పూర్వముకంటె ఈనాటి మానవులయందు దుర్బుద్ధులు, దురాలోచనలు, దుర్గుణములు, దుష్ప్రవర్తనలు అధికమైపోతూ వస్తున్నాయి. దీనికి కారణమేమిటి? చక్కగా లోతుకు దిగి విచారించిన మానవునియందు ఇంకా పశుత్వము శేషించి వుండటమనే అర్థమవుతున్నది.

పవిత్రమైన ఈ కాలమును అరనిముషమైనా వ్యర్థముచేయకుండా జీవితాన్ని సాగించేవాడే నిజమైన మానవుడు. ఈ విలువైన కాలము ఎవ్వరికీ స్నేహితుడు కాదు. కాలచక్రము మార్చుటకు వీలుకాదు. కాలమును అందరూ అనుసరించవలసినదేగానీ కాలము ఎవ్వరినీ అనుసరించదు. కాలుడు కాలాన్ని మింగుతున్నాడు. కాలము కాయాన్ని మింగుతున్నాది. కాయమునకు అధిపతి కాలము. కాలమునకు అధిపతి కాలుడు. ఆ కాలుడే దైవస్వరూపుడు. ఈనాటి మానవుడు అట్టి కాలస్వరూపుని విస్మరించి కేవలము లౌకిక, భౌతిక సుఖసంతోషముల నిమిత్తమై కాలమును వ్యర్థముగావించుచున్నాడు. పారమార్థికమే ప్రాతిభాసికమునందు, వ్యావహారికమందు ప్రతిబింబిస్తూ వస్తున్నది. సముద్రము లేక అలలు లేవు, అలలు లేక నురుగు లేదు. ఈ నురుగు అలలనాశ్రయించి వుంటున్నది. సముద్రము, అలలు, నురుగు అని భిన్నభిన్నముగా మనం యోచిస్తున్నామేగానీ మూడింటియందు వున్న నీరు ఒక్కటే. నీటియొక్క గుణము ఈ మూడింటియందూ వున్నది. చల్లదనము, తెల్లదనము, మాధుర్యము ఇవి నీటియొక్క గుణములు. ఇవన్నియూ పారమార్థికమునుండి ఆవిర్భవించినవే. అనుగ్రహమనే సత్ చిత్ ఆనందమనే సాగరమునుండి ఆరంభమైనవే ఈ జీవులు. ఈ జీవుల ప్రాణమే దివ్యత్వము. ఈ మూడింటి ఏకత్వమును గుర్తించిన నిజమైన ఆనందమును అనుభవించగలరు. దీనినే జాగ్రత్త, స్వప్న, సుషుప్తి అని పిలుస్తూ వచ్చారు. జాగ్రత్తయందు అనుభవించేది ఒకే వ్యక్తి. స్వప్న దృశ్యము అనుభవించేది అదే వ్యక్తి. సుషుప్తియందు అనుభవింతేదీ అదే వ్యక్తి. కాని, జాగ్రత్త, సుషుప్తి అనే కాలము, స్థానము, అనుభూతులు వేరువేరు అయినప్పటికీ వ్యక్తి ఒక్కడే. కానీ, పారమార్థికమును వదలి లౌకికమైన జీవితమునాశించి ఈ వ్యవహారమే సరైన జీవితమని విశ్వసించి కేవలము స్వప్న దృశ్యమును చూచి భ్రమించినట్లుగా వుంటున్నది. ఈ స్వప్న దృశ్యములు ఏనాటికీ సత్యము కావు. కలలో చూచిన మేడలు మిద్దెలు కన్నులు విప్పిన లేవుకదా! అదేవిధముగా ఈ వ్యవహారికమునందనుభవించే సుఖదుఃఖములన్నియూ కూడ స్వప్నదృశ్యములే! ఐతే ఇవికూడను పారమార్థికమునుండి ఆవిర్భవించినవే. వ్యవహారికము, పారమార్థికము వేరని భావించకూడదు. రెండింటి ఏకత్వము గుర్తించినప్పుడే మానవత్వము అర్థమవుతుంది.

మానవునకు సుఖము, దుఃఖము అందించేది మనస్సే. మనస్సే మూలకారణము. 'మనఏవ మనుష్యాణాం కారణం బంధమోక్షయోః' ఈ బంధమోక్షములకు మనస్సు కారణమైనప్పుడు మనయొక్క విముక్తికుకూడా మనస్సే కారణము. ఈనాటి ప్రపంచమందు ఈ అశాంతిని వీడి నిత్యసత్యమైన శాంతిని ప్రజలందుకోవాలంటే దీనికి ఏవిధమైన నవసమాజము, యువసమాజము స్థాపింపనక్కరలేదు. కొత్త మతము అక్కరలేదు. కొత్త విధానము అక్కరలేదు. ఒక్కటి మాత్రము కావాలి. పవిత్రమైన మనోహృదయములు కలిగిన స్త్రీపురుషులు అవసరము. పవిత్రమనోహృదయులైన స్త్రీపురుషులుండినప్పుడే ఆ రాజ్యము దివ్యమైన రాజ్యముగా, దివ్యమైన పరిపాలనగా జరుగుతుంది. ఐతే, ఆ రాజ్యములో చిత్తశుద్ధి, శీలసంపత్తి రెండూ వుండినప్పుడే ఈ సద్గుణవంతులైన స్త్రీపురుషులు నిలువగలరు. ఈ చిత్తశుద్ధి, సౌశీల్యం అభివృద్ధి కావలెనన్న, తేజోవంతము కావలెనన్న, వికసించ వలెనన్న దీనికి ఆధారము నీతి. ఆధ్యాత్మికమే లేకున్న నీతి నిలవదు. కనుక, ఆధ్యాత్మికమనే పునాదిలోనే నీతి అనే గోడలు కడుతూ రావాలి. నీతియనే గోడలపైన చిత్తశుద్ధి, శీలసంపత్తి అనే రూఫ్‌ను మనం వేసుకోవాలి. అదే జీవితముయొక్క భద్రత. గోడలు కట్టిన మాత్రమున చాలదు. పునాదులు తవ్విన మాత్రమున చాలదు. పై కప్పు వేసినప్పుడే జీవితము పరిపూర్ణమవుతుంది. కనుకనే,

Self-confidence foundation
Self-satisfaction wall
Self-sacrifice roof
Self-realisation life.

ఇట్టి జీవితమును మనము అనుభవించవలెనన్న మొట్టమొదట పునాది భద్రముగా వుంటుండాలి. ఆధ్యాత్మికము సరిగా వుండాలి. మన భారతదేశముయొక్క గౌరవకీర్తులన్నీకూడను ఆధ్యాత్మికముచేతనే పెరుగుతూ వచ్చింది. అనాదికాలమునుండి భారతదేశ కీర్తిప్రతిష్ఠలు ఆధ్యాత్మికసంపత్తిపైనే ఆధారపడి ఉంటున్నది. అనేకమంది మహనీయులు, అనేకమంది ఉత్తమ స్త్రీలు,

పతివ్రతామతల్లులు, పవిత్ర హృదయులు, దివ్యభావములు కలిగిన పుత్రులు జన్మించటంచేత భారతదేశము ఈవిధమైన సార్థక నామము అందుకోగలుగుతూ వచ్చింది. వారు ఈనాడు లేకపోయినప్పటికీ వారి ఆదర్శాలు మాత్రం ఈనాటికీ దేదీప్యమానంగా ప్రకాశిస్తున్నాయి.

నిరత సత్యవ్రతుడి ధరణినేలిన హరి
శ్చంద్రుడీ ధరబాసి చనగలేదె
ఎల్ల లోకములేలె ఎసగ శ్రీనలరాజు
తనవెంట భూమిని గొనుచు చనెనె
కృతయుగంబును నలంకృతి చేయు మాంధాత
సిరి మూటగట్టుక అరగినాడె
జలధి సేతువుగట్టె అలనాడు శ్రీరాము
డుర్విపై నిప్పుడు ఉన్నవాడె
ఎందరెందరు రాజులు ఏగినారొ
ఒక్కరును  వెంటగొనిపోవరుర్వీతలము
నీవు మాత్రము రాజ్యంబు భోగములను
తలను కట్టుక పోదువా ధర్మహృదయ!

ఎవ్వరూ ఏమీ తీసుకొని పోలేదు. వారి ఆదర్శములను యితరులకందించి పోయారు. ఇంక స్త్రీలు తమయొక్క జీవితమును సమాజమున కంకితముగావించి ఆదర్శవంతమైన నారీమణులుగా పోషిస్తూవచ్చారు. పతియే సత్యమని విశ్వసించి పతి ప్రాణములను తిరిగి సాధించుకొన్న సావిత్రి తత్త్వము స్త్రీలకంతా అందిస్తూపోయింది. ఎన్ని కష్టములు సంభవించినప్పటికీ, ఎన్నివిధములైన అననుకూలములు సంభవించినప్పటికీ పతియొక్క తత్త్వమును హృదయమునందు నిలుపుకొని పది నెలలు లంకలో గడపుకొని నారీమణులకంతాకూడను ఆదర్శవంతమైన స్త్రీగా నిరూపిస్తూ వచ్చింది సీత. అలాంటి పవిత్రమైన స్త్రీపురుషులు ఆనాడు వుండటం చేత దేశము సుక్షేమంగా, సుభద్రముగా, నిత్యకల్యాణముగా పచ్చతోరణంగా కళకళలాడుతూ వచ్చింది. కాని, ఈనాడు ఈ పవిత్రమైన హృదయాన్ని ఎవరూ యోచించటం లేదు. శీలసంపత్తిని ఎవరూ చింతించటం లేదు. కేవలము మానసిక శాంతి తన దివ్యమైన భావములను ప్రకటించినప్పుడే శాంతి మనకు చేకూరుతుంది.

ఈనాటి మానవుడు, 'ప్రేమిస్తున్నాను, ప్రేమిస్తున్నాను' అని పలుకులు ఉచ్చరిస్తున్నాడు. నిజముగా ఈ ప్రేమ అంటే ఏమిటో వారు అర్థంచేసుకోటం లేదు. ఏమిటి ఈ ప్రేమ? తెల్లవారి మొదలు రాత్రి పరుండినంతవరకు ప్రక్క ఇంటివాడు స్వస్వరూపముతో కనిపిస్తూ వుండినప్పటికీ వానిని ప్రేమించకుండా కనిపించని పరమాత్ముని ప్రేమిస్తున్నామంటే యిదేమైనా నమ్మదగిన విషయమేనా? కనిపించే తల్లిదండ్రులనే ప్రేమించటం లేదు. వ్యక్తులను ప్రేమించినప్పుడే శక్తిని ప్రేమించినవాడవౌతావు. ప్రతి వ్యక్తియందు అంతర్భూతమైన దైవము ఒక్కడే! ఏకోవసి సర్వభూతాంతరాత్మ. అందరియందు వున్నాడు భగవంతుడు. నీవు ఎవరిని ద్వేషించవద్దు. అద్వేష్టా సర్వభూతానామ్ కనుకనే ఉపనిషత్తులు 'ఉత్తిష్ఠత, జాగ్రత, ప్రాప్యవరాన్నిబోధత' అని చెప్పాయి. ఎవరికి నమస్కరించినా భగవంతునికే చేరుతుంది. ఎవరిని తిరస్కరించినా, ద్వేషించినా అదికూడను భగవంతునికే చేరిపోతుంది. భగవంతడంటే ఎవరు? ఏదో ఒక దేవాలయమునందో, ఏదో ఒక క్షేత్రమందో ఉన్నాడని కాదు. 'దేహోదేవాలయ ప్రోక్తో జీవోదేవస్సనాతనః' దేహమే దేవాలయము. జీవుడే దేవుడు. 'దేవుడనగ వేరు దేశమందున లేడు, దేవుడుండు తనదు దేహమంచె' ఇటువంటి దేహమును మనము అలక్ష్యము చేస్తున్నాము. ఇట్టి సత్యమును గుర్తించే తత్త్వమును మానవుడు ఈనాడు విచారించాలి. ఇట్టి సత్యభావములు మానవుడు విస్మరించటం చేతనే ఈనాడు తన జీవితము చాలా అశాంతిపాలౌతున్నది. హృదయములో ప్రకాశము వుండినప్పుడే మానవుడు చేసే సమస్త కర్మలూ సక్రమమైనవిగా వుంటాయి. మానవుడు వేసే ప్రతి అడుగూ అధర్మములో పడుతున్నాది. పలికే ప్రతి పలుకూ సత్యమును విస్మరిస్తున్నాది. చూచే ప్రతి చూపునందు ప్రేమ అయోమయమైపోయింది. ఆలోచించే ఆలోచనలలో దూరదృష్టి నశించిపోయింది. కోరే కోరిక కూడా స్వార్థము, స్వప్రయోజనము అయిపోయింది. మానవునియందు చైతన్యము చల్లబడిపోయింది. ఇంద్రియములు స్వేచ్ఛావిహారము సలుపుచున్నవి. నిజముగా చెప్పవలెనన్న మానవత్వమే నిర్మూలనమైపోయింది.

ఇంద్రియనిగ్రహము చేసుకొనే విధానము మొట్టమొదట గుర్తించాలి. గుర్తించి వర్తించటానికి ప్రయత్నించాలి. ప్రతి చిన్నదానికి ఉద్రేకము, ద్వేషము, అసూయ, అహంకారము అబ్బా! చెప్పటానికి వీలులేని దుర్గుణములతో నిండిపోతున్నాడు ఈనాటి మానవుడు.

మానవత్వమెట్లా అవుతుంది? మానవుడు కరుణామయుడుగా వుంటుండాలి. కరుణే తన హృదయంగా వుంటుండాలి. హృదయముయొక్క ప్రతిబింబమే ప్రపంచముగా కనిపించాలి. విశ్వవ్యాప్తమైన తత్త్వము ఒక్క హృదయమునందే వుంటున్నది. దీని అర్థమును మనము చక్కగా గుర్తించాలి. హృత్ దయ హృదయము. దయ కలిగినదే హృదయము. అదే కరుణ. కరుణ లేని హృదయము కఠినమైన హృదయమే! ఈ కఠినమైన హృదయములో కఠినమైన భావములే ఆవిర్భవిస్తాయి. పులిలో మేక గుణములు పుడతాయా! క్రూరమృగము నందు క్రూరగుణములే పుడుతుంటాయి. క్రూరత్వాన్నే అనుభవిస్తుంది. తన ప్రవర్తన అంతా క్రూరంగానే వుంటుంది. ఆకలిగొన్నదే అని పులికి మనం పూరీచపాతీ యిస్తే అది భుజిస్తుందా! కంపుకొట్టే మాంసమే దానికి రుచి. కనుక, భౌతికమైన, ప్రాకృతమైన ఈ జీవితమునకు అనిత్యమైన సుఖములే నిజసుఖములుగా భావిస్తున్నారు. ఇవి సత్యసుఖములు కాదు. అందుకోసమే త్యాగరాజు, 'నిధి చాలా సుఖమా, ఈశ్వర సన్నిధి చాలా సుఖమా నిజముగ తెలుపుము మనసా' అని ప్రశ్న వేసుకొన్నాడు. అలాంటి త్యాగరాజు కూడా కొన్ని పరిస్థితులయందు, కొన్ని బాధలందు, కొన్ని సంకటములందు మనస్సు కొంత చలించింది. భరించుకోలేని బాధలు సంభవించాయి. ప్రాణసమానముగా ఆరాధించుచున్న సీతారాముల విగ్రహములు కనిపించకుండా పోయినవి. 'నేనెందు వెదకుదురా' అని అనేక పర్యాయములు అనేక చోట్ల వెతికాడు. విసుగెత్తింది మనస్సు. ఇంక క్రోధము ఆవిర్భవించింది. 'రామా! నీవు గొప్ప శక్తిమంతుడవని భ్రమించాను. కానీ, నీలో శక్తి లేదా? లేక నాలో భక్తిలేదా? నా భక్తి నాకు తెలుసు. సర్వకాల సర్వావస్థలందు రామచింతనే చేస్తున్నాను. సతతం రామచింతన. నాలో భక్తి లేదంటే నేను ఒప్పుకోను. నీలోనే శక్తి లేదు. నీలో శక్తి లేకపోవటం చేత నా బాధ నివారణ చేయలేకపోతున్నావు'. ఆవేశములో, అసంతృప్తితో,ఆ నిరాశా నిస్పృహలతో అనేకవిధములుగా రాముని విమర్శించాడు. కాని, తరువాతతన దోషమును తాను గుర్తించాడు. 'రామా! నీలోనే శక్తి లేకపోతే ఈవిధమైన వ్యక్తులు నిన్నాశ్రయించేవారా!

కపి వారధి దాటునా? కలికి రోట గట్టునా?
లక్ష్మిదేవి వలచునా? లక్ష్మణుండు కొలుచునా?
శుద్ధబుద్ధిగల భరతుడు చూచిచూచిమ్రొక్కునా?
అబ్బ! రామశక్తి ఎంతో గొప్పరా!!!

నీలో శక్తిలేకపోతే వీరందరూ నిన్నాశ్రయించేవారా? ఈ ఒక్క విషయంలో మీరు అర్థము చేసుకోవచ్చును. సాయిలో శక్తి లేకపోతే అమెరికా, లండన్ 108 దేశములనుండి వచ్చిపడుతున్నారు. వారిని పిలిచారా! వారు అమాయకులా! లేక మూర్ఖులా! కాదు కాదు, గొప్ప మేధావులు. మేధాశక్తి వుండిన చాలదు. దివ్యభావము అందులో వుండాలి. మానవత్వములో వుండిన దివ్యత్వము ధనకనక వస్తువాహనాదులతో తూచటానికి వీలుకాదు. ఈ ప్రేమను ప్రేమతోనే తూచాలి. అట్టి ప్రేమతత్త్వాన్ని ఈనాడు మానవుడు గ్రహించాలి. ప్రేమయే వుండిన ద్వేషమే వుండదు. ద్వేషమే లేకుండిన సమాజములో అశాంతికి అవకాశమే వుండదు. సమాజం శాంతిభద్రతలతో తులతూగవలెనన్న ప్రేమతత్త్వాన్ని పెంచుకోవాలి. మానవత్వంలో వుండే దివ్యత్వాన్ని గుర్తించటానికి తగిన ప్రయత్నం చేయాలి. అట్టి పూర్ణత్వమైన మనస్తత్త్వాన్ని మనం పొందాలి.

'చంద్రమా మనసో జాతః, చక్షోఃసూర్యో అజాయత'. ఇది వేదవాక్యము. మనసుయొక్క ప్రతిబింబమే చంద్రుడు. అటువంటి చంద్రుడు పరిపూర్ణమైనప్పుడే ఇది పూర్ణచంద్రుడని చెప్పవచ్చును. పూర్ణిమ అనేది ఎలా వచ్చింది? ఎక్కడ ప్రారంభమైందో అక్కడికిపోయి చేరినప్పుడే పూర్ణమవుతుంది. ఇక్కడ ప్రారంభమై చుట్టి చుట్టి వచ్చి తిరిగి అక్కడనే చేరిపోవాలి. అదే పూర్ణము. ఈ పూర్ణమనేది ఒకవిధమైన గుండ్రముగా వుండాలి. ఈ పూర్ణమును ఒక అర్థముగా చేసినప్పుడు అది అర్థవృత్తమవుతుంది. ఈ అర్థవృత్తము ప్రాకృతమైన జీవితము. ఒకచోట ప్రారంభమై యింకోచోట నిలిచిపోతుంది. ఈనాడు కొత్తది రేపటికి పాతదైపోతుంది. రేపు కొత్తది ప్రారంభమవుతుంది. ఈ పూర్ణమట్టిది కాదు. నిరంతరం కొత్తదిగానే వుంటుంది. అదేవిధంగా మన మనస్సును పూర్ణమైన ప్రేమతో నింపుకున్నప్పుడే ఈనాడు గురుపూర్ణిమ అని చెప్పటానికి వీలవుతుంది. గురు అజ్ఞానమును రూపుమాపేది అని అర్థము. చీకటిని దూరము చేసేదే పూర్ణిమ. అజ్ఞానమనే చీకటిని దూరము చేసేదే ఈ గురుపూర్ణిమ. కనుక, మనయొక్క ప్రేమతత్త్వమును పరిపూర్ణమైన ప్రేమతత్త్వముగా రూపొందించాలి.

పూర్ణమదః పూర్ణమిదం పూర్ణాత్పూర్ణముదచ్యతే
పూర్ణస్య పూర్ణమాదాయ పూర్ణమేవావశిష్యతే.

అదియే నిజమైన భక్తిప్రపత్తులయొక్క ప్రభావం. కాని, ఈనాడు మనది పరిపూర్ణంగా లేదు. అయితే ఏవిధంగా వుంది? ఏదో కొంత కొరత కల్గివుంది. ఇక్కడ ప్రారంభమైంది, ఇక్కడ వచ్చి కలిసింది. మధ్యలో పెద్ద అగాథమైన, అర్థరహితమైన లోయవుంది. కనుకనే, పరిపూర్ణం కాని దానికి ఫలితం కూడను పరిపూర్ణంగా వుండదు. పరిపూర్ణ హృదయమునకు పరిపూర్ణ

ఫలితమే వుంటుంది. కనుక, పరిపూర్ణంగా రాత్రింబవలు ఆఫీసులో పనిచేసినప్పుడే అతనికి నెలజీతము యిస్తారు. వానికి రిటైర్ అయిన తరువాత పెన్షన్ యిస్తారు. పార్ట్ టైమ్ వర్కర్స్‌కు, పార్ట్‌టైమ్ డివోటీస్‌కు ఫుల్‌పేమెంట్ రాదు. పేమెంటే కాకుండా పెన్సన్‌కూడా రాదు. అనగా పూర్ణ హృదయంతో వున్నవానికి భగవంతుని అనుగ్రహం కూడా పరిపూర్ణంగా వుంటుంది.

నవవిధ మార్గములలో ప్రవేశించి, ఏ మార్గమైనా ఒక దానిని పరిపూర్ణం గావించుకోటం సాధకునియొక్క ప్రధానమైన సత్యతత్వం. ఏమిటి ఈ నవవిధ మార్గములు.

శ్రవణం కీర్తనం విష్ణోఃస్మరణం పాదసేవనమ్
అర్చనం వందనం దాస్యం సఖ్యమాత్మనివేదనమ్.

స్నేహం చాలా అవసరం. ఎట్టి స్నేహం? ఈనాటి కలియుగ స్నేహమా? జేబులో డబ్బు వుంది. తండ్రికి అధికారముంది. వందలమంది 'హలో, హలో' అని వచ్చి చేరుతారు. జేబులో డబ్బు లేది, తండ్రికి అధికారము పోయింది, రిటైర్ అయ్యారు. అలాంటి వారికి ఎవ్వరూ దగ్గరకు వచ్చి 'గుడ్‌బై' కూడా చెప్పరు. ఇలాంటి స్నేహితులు స్నేహితులా? ఇవి కేవలం తాత్కాలికమైన సంబంధాలు. భౌతికమైన, లౌకికమైన వాంఛలతో కూడిన స్నేహము నిరంతరం సత్యనిత్యమై, నీ వెంట, యింట, జంట వుండి కాపాడేటువంటి స్నేహం కాదు. ఇంటా, వెంట, జంట, కంట వుండి చూచుకునే స్నేహితుడు ఒక్క భగవంతుడే. అందువల్ల ఆ భగవంతునితో మనం స్నేహం చెయ్యాలి. సర్వవిధములైన బాధలూ నివారణ కాగలవు. ఈ స్నేహం చేసినప్పుడు రెండూకూడా ఏకమైపతుంది. కనుకనే, జీసస్‌కూడా మొదట తాను సమాజంలో ప్రవేశించినప్పుడు, 'I am the messenger of God' అన్నాడు. అనగా ఆ భగవంతునకు నాకు ఎట్టి సంబంధమూ లేదు. అతని ఆజ్ఞను మాత్రం శిరసావహిస్తున్నాను. కాని, అతని సమీపంగా పోయే మార్గం కనుక్కొని, సాధన సల్పి, తరువాత కనుకున్నాడు. ' I am the son of God' అతనికి, నాకు సంబంధం వుంది. అతను తండ్రి, నేను కొడుకు. అన్నాడు. తదుపరి 'I and my father are one' అన్నాడు. మనంకూడా ప్రకృతి స్థితిలోపల అందరూ మెసెంజర్సే. ప్రతి వ్యక్తికూడా దివ్యత్వాన్ని, సత్యత్వాన్ని, ప్రేమతత్త్వాన్ని జగత్తులో చాటాలి. మన భారతదేశం ఆధ్యాత్మికత్వంపైన ఆధారపడివుంది.

ప్రేమస్వారూపులారా! ఈ విషయాన్ని మీరు చక్కగా గుర్తించుకోవాలి. భారతదేశములో ఆధ్యాత్మికమే నశించిన భారతదేశమే క్షీణించిపోతుంది. భారతదేశమే నశించిన ప్రపంచమే శూన్యమైపోతుంది. కాబట్టి, యావత్ప్రపంచమంతా భారతదేశంపైన ఆధారపడి వుంటున్నది. కనుక, ఈ భారతదేశంయొక్క విశిష్టతను చక్కగా గుర్తించాలి. మీరు ఈ ఆధ్యాత్మికాన్ని వీధివీధికి చాటాలి. ఈనాడు ఆధ్యాత్మికతను విస్మరించటం చేతనే అనేక అశాంతులు మన చుట్టూ విస్తరిస్తూ వస్తున్నాయి. మనలో ప్రేమయే శూన్యమైపోయింది. మానవత్వమే నసించిపోయింది. ఆకార మానవుడుగా కనిపిస్తున్నామేగాని ఆచరణలో ఏమాత్రం మానవత్వం లేదు. ఎప్పుడు మానవుడవుతావు? మంచి మనసు, పరిపూర్ణమైన మనసు పెట్టుకొన్నప్పుడు మానవుడవౌతావు. కాబట్టి అట్టి మనస్సు నుండి పుట్టినటువంటివాడే మానవుడు.

అధ్యాపకులారా! సత్యవాక్ పరిపాలన. తన ఆలుబిడ్డలనైనా త్యాగము చేసి సత్యాన్ని నిలబెట్టుకోటానికి ప్రయత్నించాడు, హరిశ్చంద్రుడు. ఇలాంటి మహా పవిత్రులైన వ్యక్తులు భారతదేశపు బిడ్డలుగా వుండినప్పటికిని, మనం ఈనాడు వారిని అనుసరించలేక, వారిని ఆదర్శముగా తీసుకోలేక, వారి ఆజ్ఞను శిరసావహించలేక మనం కేవలం ఒకవిధమైన నిర్వీర్యులుగా తయారైపోయాము. మీరు బాలవికాస్ అధ్యాపకులుగా వున్నప్పుడు పిల్లలకంతా మన ప్రాచీన మహనీయులయొక్క తత్త్వము, మహర్షులయొక్క తత్త్వము, పతివ్రతలయొక్క తత్త్వము, సత్యశీలులయొక్క తత్త్వాన్ని ఆ పిల్లలకు చక్కగా బోధించాలి. తల్లిదండ్రుల భక్తి. శ్రవణకుమారుడు ఏవిధంగా చేశాడు? పేరు మాత్రం శ్రవణకుమారుడు అని పెట్టుకుంటే ప్రయోజనం లేదు. తల్లిదండ్రులను గౌరవించే వాడుగా వుండాలి. తన స్వార్థాన్ని త్యాగంచేసి, తల్లిదండ్రులయొక్క జీవితానికి సుక్షేమాన్ని అందించే పుత్రునిగా వుండినప్పుడే అతను సత్పుత్రుడు.

కులములో ఒకండు గుణవంతుడుండిన
కులము వెలయు వాని గుణము చేత
వెలయు వనములోన మలయజంబున్నట్లు

అడవిలోపల ఒక్క మల్లె చెట్టు వున్న, ఆపుష్పంయొక్క సుగంధం సర్వత్రా వ్యాపింపచేస్తుంది. కనుక, తల్లిదండ్రులయొక్క భక్తిని శ్రవణకుమారుడు ప్రపంచానికి బోధిస్తూ వచ్చాడు. ఆ శ్రవణకుమారుని తత్త్వాన్ని మన పిల్లలకు బోధించాలి. గురుభక్తిలోపల– ఏకలవ్యుడు. సమాజ క్షేమంకోసం, లోకకల్యాణము కోసం దేనినైనా త్యాగం చేయాలి. దైవభక్తి– ప్రహ్లాదుడు. ఎలాంటి పరిస్థితులయందైనా

తన్ను నిశాచరుల్ పొడవ దైత్యకుమారుడు మాటిమాటికో
పన్నగశాయి! ఓ దనుజభంజన! ఓ జగదీశ! ఓ మహా
పన్న శరణ్య! ఓ నిఖిల పావన! యనుచు నుతించెగాని తా
కన్నుల నీరు తేడు, భయకంపసమేతుడుకాడు భూవరా!

కత్తులు తీసుకొని పొడుస్తున్నారు. కాని, ఆ చిన్న బాలుడు 'అమ్మా! అబ్బా!' అని అరవలేదు. 'నారాయణ! నారాయణ!'. కన్నులకు ఏమాత్రం నీరు లేదు. కారణం ఏమిటి? ప్రాకృతమైన దుఃఖములకు కంటినీరు నింపకూడదనే సత్యాన్ని ప్రహ్లాదుడు లోకానికి చాటాడు. అనిత్యమైన, అశాశ్వతమైన ఈ లోక దుఃఖములకు, నష్టములకు మనం కంటినీరు నించకూడదు. ఎవరికోసం కంటినీరు నింపాలి? దైవానికి ఆనందబాష్పములు అర్పితము చేయాలి. నారములనగా నీరు. నయనములనగా కన్నులు. నీరు కన్నులనుండి వచ్చినప్పుడే నారాయణుడు అయిపోయింది. నారాయణ అనగా నయనములనుండి ఆనందబాష్పములు వదలటమే. ఎందుకోసం? ఆ నారాయణునకు మనకు సన్నిహిత సంబంధబాంధవ్యము చాలా కాలమునుండి వున్నది. మనము దేహము ధరించినంత మాత్రమున నూతనులముగాము, పురాతనులము కాము. సనాతనులమే! ఆ సనాతన ధర్మమే మనయొక్క మానవధర్మము. కనుకనే, మానవ అని పిలుస్తూ వచ్చారు. మా- కాదు, నవ-కొత్తది. కొత్తది కాదు. మనము కొత్తవారు కాదు. పాతవారమే. కాని, పాతవారము ఈనాడు రోతవారముగా తయారైపోయినాము. ఏనాడు భగవంతునితో సంబంధము కోల్పోయిందో అది మన రోతజీవితమే. దైవముతో మనము సన్నిహిత సంబంధబాంధవ్యము పెట్టుకున్నప్పుడే మనము నిజమైన సనాతనులము. దైవత్వమే సర్వమునకు మూలకారణము. ఇలాంటి దైవత్వమును మనము ఈ లోకములో చాటాలి. అమెరికాలో, ఇతరదేశములలో నోటుపైనో, coin పైనో 'trust in God' అని ప్రింటు చేస్తారు. కాని, దురదృష్టవశాత్తూ మన ప్రభుత్వము అలాంటిది ప్రింటు చేయటం లేదు. ఎందుకని ప్రశ్నిస్తే సెక్యులర్ స్టేట్. అర్థము లేని పదము. నీ పవిత్రమైన భావములు నిన్ను వదలుకోమని చెబుతుందా సెక్యులర్ స్టేట్. సెక్యులర్ అనగా ఎవరినీ బాధించకూడదు, విమర్శించకూడదు, హింసించకూడదు. ఏ దేవుని విమర్శించకూడదు. నీ దానిని నీవు అనుభవించుటకు అడ్డేమి వుంది? నీ భక్తిప్రపత్తులకు అడ్డుతగలటానికి ప్రభుత్వమునకు ఏ ఆధికారముంటున్నాది? ఈ సెక్యులర్ అనే పదమునకు సరైన అర్థము మనం తెలుసుకోటం లేదు. ఏ మతాన్ని మీరు విమర్శించకండి. ఏ మతాన్ని ద్వేషించకండి. సర్వమత సారమే మానవుని జీవితం. మైసూర్‌పాక్, పాలకోవ, జిలేబి, ఖీర్ ఎన్ని చేసినా అన్నింటియందుండిన సుగర్ ఒక్కటే. బుద్ధ, క్రీస్తు, జొరాష్ట్రియన్ ఇవన్నీ నామములే, అన్నిటియందున్నది ఒకే దివ్యత్వము. మతములనే పేరుతో కలహములు వృద్ధిగావించుకొని అనేక రక్తపాతములు జరుగుచున్నవి. కాదు, కాదు. మన పిల్లలకు బోధించాలి.

మతములన్ని చేరి మంచినే బోధించె
తెలిసి మెలగ వలయు తెలివితోడ
మతులు మంచివైన మతమేది చెడ్డది?
వినుము భారతీయ వీరసుతుడ!

నీ మతి చెడిపోయినప్పుడే మతములు చెడిపోతున్నాయిగాని మతి చక్కగా వుంటేమతములన్నీ మంచివే. దేవుడు ఒక్కడే. అలాంటి తత్వాన్ని మనము పిల్లలకు బోధించాలి. నీ యిష్టమువచ్చిన మూర్తిని పూజించుకో. ఏ నామము యిష్టమైతే అది స్మరించుకో. ఆవిధమైన సమత్వమైన భావముచేత ఈ విశ్వానికి మనము ఈ సుబోధలు అందించినప్పుడు దేశమంతా ఎంత సుభిక్షమును పొందుతుంది! మనము భగవంతుని పూజిస్తున్నాము. ఏవిధంగా పూజిస్తున్నాము? ఈ పూజకు ఈ ఫలితము, ఈ పూజకు ఈ ఫలితమని మనం చెప్పుకోటం లేదే.

పూలజాతులు వేరు, పూజలొకటె
దర్శనంబులు వేరు, దైవంబు ఒక్కడే
జన్మలన్నియు వేరు, జననమొకటె.

కోటీశ్వరుడు ఆకాశమునుండి ఉట్టిపడలేదు. కూటిపేద భూమినుంచి పుట్టలేదు. ఇరువురూ తల్లి గర్భమునుండే ఆవిర్భవించారు. ఈ దివ్యత్వమునకు ఏకత్వము ఒక్కటే. ఆకలైనప్పుడు కోటీశ్వరుడూ తింటాడు, కూటిపేద తింటాడు. కోటీశ్వరుడు పంచభక్ష్యపరమాన్నములతో కడుపు నింపుకోవచ్చు. కూటిపేద అంబలితో కడుపు నింపుకోవచ్చును. అన్నములు వేరు ఆకలొక్కటె. దాహమైనప్పుడు వంకలోగాని, కాలువలోగాని నీరు త్రాగి దాహము తీర్చుకుంటాడు. ఇంక, ధనవంతుడు కూల్‌డ్రింక్ త్రాగుతాడు. రెండూ దాహమును తీర్చునవేగాని వేరువేరుగా కనిపించాయి. అదేవిధముగా సర్వులూ ఒక్కటేయని ఏకత్వమును చక్కగా చాటాలి. జననమరణములుకూడా అందరికీ ఒక్కటే. మానవత్వములో ఇట్టి యదార్థమును పిల్లల హృదయాల్లో ప్రవేశపెట్టాలి. అదే సత్యం. సత్యం ఒక్కటే. ఏకం సత్ విప్రాః బహుదా వదన్తి. ఈ టంబ్లరులో నీరుంది. తెలుగువారంతా నీరని పిలుస్తున్నారు. తమిళ్‌వారు తన్ని

అని పిలుస్తున్నారు. హిందీవారు పానీ అని పిలుస్తున్నారు. అమెరికావారు వాటర్ అని పిలుస్తున్నారు. దేశభాషలందు వ్యత్యాసము గోచరించవచ్చుగాని పరతత్త్వము ఒక్కటే!

ఇట్టి పరతత్త్వమును మనము వాక్కుచేత కాపాడుకోవాలి. అధికభాష మనము ఏమాత్రమూ ప్రవేశపెట్టకూడదు. నాలుక చేసే పాపములు నాలుగు. పిల్లలకు మీరు చక్కగా బోధించాలి. అసత్యమాడటం మొదటి పాపము. అధికంకా మాట్లాడటం రెండవ పాపము. పరులను దూషించటం మూడవ పాపము. చాడీలు చెప్పటం నాల్గవ పాపము. ఆదిశంకరులవారు చెప్పినది ఒకటి, చేసేది వేరొకటి ఇదే పాపమన్నారు. పదకొండుమంది శిష్యులతో కాశీ చేరాడు శంకరులవారు. ప్రార్థించాడు. 'దేవదేవుడా నీకు శరణాగతుడను. ఐతే నేను మూడు పాపములు చేశాను. ఈ మూడు పాపములను పరిహారము గావించమ'ని ప్రార్థించాడు. ఏమిటి ఈ మూడు పాపములు? మొట్టమొదటిది. 'యతోవాచో నివర్తంతే అప్రాప్య మనసా సహ' నిన్ను వర్ణించుటకు వాక్కు చాలదు. అలాంటి నిన్ను నేను వర్ణించుటకు ప్రయత్నిస్తున్నాను. పాపము కాదా! భగవంతుని వర్ణించుటకు వీలుకాదు. మనసుకుగాని, వాక్కునకుగాని, నిన్ను వర్ణించుటకు వీలుకాదని తెలిసి నేను వర్ణిస్తున్నాను. ఇది ఎంత పాపము. చెప్పినది ఒకటి చేసేది మరొకటి. ఈ పాపము క్షమించమని కోరాడు. నీవు సర్వాంతర్యామి, సర్వభూతాంతరాత్మ అని నేను సంబోధిస్తున్నాను. సర్వత్ర ఉన్నావని సర్వులకు బోధిస్తూ నిన్ను దర్శించాలని కాశీకి వచ్చాను. ఇది పాపము కాదా! శరీరము భౌతికమని,

పాంచభౌతికము దుర్బలమైన కాయంబు
  ఎప్పుడో విడిచేది ఎరుకలేదు
శత వర్షములదాక మితము చెప్పిరిగాని
  నమ్మరాదామాట నెమ్మనమున
బాల్యమందో మంచి ప్రాయమందో లేక
  ముదిమియందో లేక ముసలియందో
ఊరనో అడవినో ఉదక మధ్యముననో
  ఎక్కడో విడిచేది ఎఱుక లేదు
మరణమే నిశ్చయమ్మది మానవునకు
బుద్ధిమంతుడై తన దేహమున్నయపుడె
తన్ను తా తెలియుట ధర్మతత్త్వ మరయ
సత్యమైనట్టి బాట శ్రీసాయి మాట!

మలినపు కొంప రోగముల క్రగ్గెడు సేవకగంప జాతసం
చలనముపొందు దుంప భవసాగరమీదగలేని కంప అం
బుంబులపొది లెమ్ము చూడ మన ముప్పుదలంపగ దేహమింక ని
శ్చలమని నమ్మబోకు మనసా! హరి పాదములాశ్రయింపవే.

ఈ దేహము అనిత్యమని నాకు తెలుసు. కాని, దేహాన్ని రక్షించుకోటానికి ప్రయత్నం చేస్తున్నాను. ఇది పాపము కాదా! ఈ దేహము ఎవరు రక్షించుకోగలరు? ఎవరిచేతా కాదు. ఇది నీటి బుడగవంటిది. మనస్సు పిచ్చి కోతివంటిది. MIND IS A MAD MONKEY, BODY is LIKE A WATER BUBBLE. DON'T FOLLOW THE MIND, DON'T FOLLOW THE BODY. FOLLOW THE COnSCIOUS. ఇదే ఆత్మ తత్త్వము. నిజమైన ఆత్మతత్త్వాన్ని నీవు విశ్వసించు. ఇలాంటి అనిత్యమైనవి చేసినప్పుడు సత్యమని భావించటమే పాపము అని చెప్పాడు. ఈ పిల్లలలోపల యిలాంటి దివ్యమైన భావాలను ప్రవేశపెట్టాలి. 'నాయనా! నీవు ప్రత్యేకమైనవాడవు కాదు. రూపనామములు వేరుగా వుంటున్నాయి. దీనిని బట్టి భేదము తలంచకూడదు. పుట్టిన తక్షణమే child అని పిలుస్తారు నిన్ను. పది సంవత్సరములకు boy అని పిలుస్తారు. 30సంవత్సరములకు man అని పిలుస్తారు. 75 సంవత్సరములకు grandfather అవుతున్నావు. అన్నింటి తత్త్వములలో నీవు ఒక్కడే. మానవులంతా child, boy, man, grandfather అని అనుభవిస్తున్నారేగానీ నీవు ఒక్కడే. బ్రహ్మచర్యమునందుగాని, గృహస్థమునందుగాని, వానప్రస్థమునందుగాని, సన్యాసమునందుగానీ దివ్యత్వము ఒక్కటే. ఇలాంటి దివ్యభావములు విద్యార్థులకు బోధించకపోవటం చేతనే విధ్యార్థులలోపల ఆధ్యాత్మికత అంటే అశ్రద్ధ, ఒకవిధమైన అసత్యంగా చూస్తున్నారు.

'నాయనా! నీకు మొట్టమొదటి గురువు తల్లిదండ్రులే. ఆ తల్లిదండ్రులను దైవసమానులుగా విశ్వసించాలి' అని చెప్పాలి. మీ బ్లడ్, మీ హెడ్డ్, నీ దుడ్డు తల్లిదండ్రులది. మొట్టమొదట తల్లిదండ్రులకు కృతజ్ఞత చూపు. అది నీ కర్తవ్యమని పిల్లలకు బోధించాలి.

వారి ఫుడ్ కావాలి. వారి దుడ్డు కావాలి. కానీ, వారిని గౌరవించనక్కరలేదా! ఎంత క్రూరత్వము. ఈనాడు నీవు నీ తల్లిదండ్రులను గౌరవించకపోతే నీకు తెలియదు యిప్పుడు, రేపటి దినము నీ పిల్లలు నిన్ను అగౌరవపరచినప్పుడు ఆనాడు కన్నీరు నించి ప్రయోజనమేమిటి? కనుక, భవిష్యత్తులో మనము సుఖశాంతులనుభవించాలంటే వర్తమానంలో మనం సక్రమమైన పనులు చేయాలి. మన కర్తవ్యాన్ని మనం నిర్వర్తించాలి. ఈ వయస్సులో నీకది తెలియదు. రేపటి దినం నీ పిల్లలే నిన్ను ఆవిధంగా శిక్షించినప్పుడు నీవెంత బాధపడతావు! కాబట్టి, భవిష్యత్తులో వచ్చేదంతా వర్తమానంలోనే చక్కగా వుంటుంది. మానవుని సమస్త బాధలకు, సమస్త కష్టములకు, సమస్త విచారములకు కారణమేమిటని ప్రశ్న వేసుకోండి. దీనికొక్కటే సమాధానం. గడచినది గడచిపోయింది. నీవు ఏమిచేసినా అది తిరిగి వాపస్ రాదు. నరుని యవ్వనము, నదీ జలము తిరిగి వాపస్ రాదు. కనుక, past is past, forget the past. నడచుకొని వచ్చినప్పుడు చూచుకొనే వచ్చావు. ఇంక వెనుకకు ఎందుకు తిరగాలి? ఇంక future. భవిష్యత్తు గురించి వూరికనే నీవు యోచన చేస్తున్నావు. ఆ future నీకు surity లేదు. రేపటి వరకు వుంటాననే ధైర్యము, ఒకశక్తి నీకు ఎక్కడ వుంది? రేపటి లోపల ఏమైపోతావో? కాబట్టి, future is not sure. live in the present. not ordinaray present, omni present. ఈ present మనకు చాలా అవసరం. ఈ present కూడా

ordinaray present కాదు. omni present. ఎలా? పాస్టంతా ప్రజెంట్‌లో వుంది. ఫ్యూచర్ అంతా ప్రజెంట్‌లో వుంది. పూర్వం వేసిన విత్తనమే ఇప్పుడు చెట్టు అయింది. నీవు వేసిన విత్తనమే మరల రాబోతోంది. కాబట్టి, ఫ్యూచర్, పాస్ట్ రెండూ ప్రజంట్‌లోనే వున్నాయి. ప్రజెంట్ నీవు భద్రంగా తీసుకోవాలి. ప్రజెంట్‌ను ఈనాడు మర్చిపోతున్నాడు. జరిగినదానిని గురించి చింతిస్తున్నాడు. రాబోయేదాని గురించి ఆశిస్తున్నాడు. వర్తమానాన్ని విస్మరిస్తున్నాడు. అందువల్లనే సర్వదుఃములు. అదీ నీవు అందుకోలేవు. ఇదీ నీవు వదులుకోలేవు. ఉన్నదానిని అనుభవించలేవు. ఏమైపోతుంది అప్పుడు? తిత్తి బోడి, నెత్తి బోడి, తిరుపతి పోనక్కరలేదు. అది బోడి, ఇది బోడి వుండి ప్రయోజనమేమిటి? కనుక నీవు వర్తమానాన్ని దృష్టిలో పెట్టుకో. వర్తమానంలో నీ వు సక్రమంగా నీ కర్తవ్యాన్ని నిర్వర్తించు. దాని రిజల్ట్ తప్పక మనకు లభిస్తుంది. కష్టే ఫలీ! నీవు హృదయపూర్వకంగా పనిచేస్తే దానికి తగినట్లుగా ఫలితం రాకుండా వుండదు. ప్రపంచమంతా ఒక అద్దము వంటిదే. నీవు ఏది చేస్తే దాని ఫలితాన్ని రేపు తప్పక అనుభవిస్తావు. రేపుకాకపోతే యింక పది సంవత్సరాలకైనా అనుభవిస్తావు. పది కాకపోతే ఏభై సంవత్సరాలకైనా అనుభవిస్తావు. ఇది తప్పునది కాదు. కనుకనే, be good, see good, do good. ఒక అద్దము ముందు పోయి నిల్చుకో. ఆ ప్రతిబింబానికి నీవు నమస్కారం చేయి. ఆ ప్రతిబింబం ఆ నమస్కారం నీకే వెనుకకు యిస్తుంది. ఆ అద్దం ముందుకు పోయి దానిని బాగా దండించు. అదీ నిన్ను దండిస్తుంది. చూచారా! నీవు ఏది చేశావో దానియొక్క రియాక్షన్ మనకొస్తుంది. ఒక కొండ దగ్గరకి పోయి నిల్చుని, ఓ.... అను. అది కూడా ఓ....అంటుంది. అది రీసౌండ్. ఇంక రిఫ్లక్షన్. ఫొటోగ్రాఫర్ ఒక స్విచ్ వేస్తాడు. తెల్లగా ప్రకాశం వస్తుంది. తక్షణమే చీకటైపోతుంది. కనుక, రియాక్షన్, రీసౌండ్, రిఫ్లక్షన్ ప్రకృతియొక్క తత్త్వం. ఈ ప్రకృతి తత్త్వాన్ని మనం అనుసరించి తీరాలి. దీనిని అనుసరించక తప్పదు. ఈ ప్రకృతి అద్దము. నీవే రియాలిటీ. జీవతత్త్వమే రిఫ్లక్షన్. జీవితంలో ఏమి చేస్తున్నా ఆ ప్రకృతి అనే అద్దంలో అన్నీ ప్రతిబింబిస్తున్నాయి.

ఇది పిల్లలకు చక్కగా చెప్పాలి. 'నాయనా! తెలిసో తెలియకో నీవు పొరపాట్లలో పడిపోతున్నావు. పాపాన్ని చేస్తున్నావు. పాపాలు తలుస్తున్నావు. ఈ పనులు నీవు చేయకూడద'ని గట్టిగా మందలించాలి. దురదృష్టవశాత్తూ ఈనాడు ఇంట్లో అమ్మలు, నాన్నలు దడించటం లేదు. టీచర్స్‌దండించకూడదు. టీచర్స్ ఏదైనా దండిస్తే ఆనాడు స్ట్రైక్. ఇంక ఈ పిల్లలేమి బాగుపడతారు? చదువంటే ఏమిటి? శిక్షణ అని పేరు. కనుక, శిక్షించాలి. అదియే నిజమైన గురుకులంలో అనుభవించవలసిన చర్యలు. కనుకనే, ఆనాటివారు ఈనాటికీ పవిత్రులై ప్రకాశిస్తున్నారు దేదీప్యమానంగా. కనుక, మనం పిల్లలకు తప్పక బోధించాలి. పూర్వం మదాలస పిల్లలకేమి బోధించేది? చాలా పవిత్రమైన భావాలు బోధించేది. నీవు పరిశుద్ధమైనవాడవు. నీవు మహా బుద్ధిమంతుడవు. నీవు నిరంజనుడవు. సంసారమనే ఈ ప్రపంచమును త్యజించు. ఈ సంసారమనేది ఒక స్వప్నము. ఎలా వస్తోంది ఈ స్వప్నం? నిద్రపోతుంటే వస్తుంది. నిద్రపోకపోతే స్వప్నమే లేదు. కలలకేమి కారణమని ఎవరైనా డాక్టర్ను అడిగితే, 'నీవు తినింది జీర్ణము కాకపోతే స్వప్నము వస్తుంది. కాకపోతే ఎప్పుడో తలచింది వస్తే స్వప్నం వస్తుంది' అని ఈవిధంగా అనేక కారణాలు చెబుతారు. స్వప్నానికి కారణం నిద్రయే. నిద్రయే లేకపోతే మనకు స్వప్నమే రాదు.

ఓంకారమనియేటి ఒక తొట్టిలోను
తత్త్వమసియనియేటి పరుపు తా పరచి
ఎరుకనే బాలుని ఏమరక ఉంచి
ఏడు జగముల వారు ఏకమై ఊప జోజో..

ఇలాంటి పాటలతో పిల్లవానిని ఉయలలో వేసి ఊపేవారు. ఈనాటి తల్లిదండ్రులు ఆవిధంగా జోల పాడటం లేదు. మా పిల్లవాడు మంచి పెద్ద చదువులు చదవాలి. దండిగా వరకట్నం యిచ్చే అత్తగారిల్లు చిక్కాలి, విదేశాలకు పంపాలి. ఇలాంటి కోరికలు ఈనాటి తల్లిదండ్రులకు. ఇదంతా ఏమి గౌరవమనుకుంటున్నారు మీరు? తమ కొడుకును తాము అమ్ముకుంటున్నారు ఈ తల్లిదండ్రులు. ఇన్ని లక్షలిస్తేగాని నా కొడుకు నీ బిడ్డను పెండ్లి చేసుకోడని ప్రతిజ్ఞ. పూర్వకాలం తల్లిదండ్రులు బిడ్డను తెచ్చి కన్యాదానం యిచ్చేవారు. ధర్మేచ, అర్థేచ, కామేచ నాతి చరామి అని ప్రతిజ్ఞ చేయించేవారు. అప్పుడు అతనుకూడా 'నాతిచరామి'అని ప్రోమిస్ చేసేవాడు. ఆ బిడ్డను తెచ్చి ఈ పిల్లవానికి దానంచేసేవారు. అందువల్లనే ఆమె అర్థాంగిగా మారిపోయింది. అందువల్లనే ఆమెను గృహలక్ష్మిగా తీర్చిదిద్దారు. ఆమె పవిత్రమైన ఇల్లాలుగా మారిపోయింది. ఈనాటి విద్యావంతులు అంతా మొట్టమొదట డిగ్రీ అయిన తక్షణమే ఏ మెడికల్ కాలేజీలోనో, ఏ ఇంజనీరింగ్ కాలేజీలోనో జేరిపోవాలి. తల్లిదండ్రులు అప్పోసప్పోచేసి ఆ సుంకం చెల్లించి సీటు తెచ్చుకుంటారు. దీనకి రెట్టింపు కట్నం రావాలి. మెడిసన్ చదివితే పది లక్షలు, ఇంజనీరింగు చదివితే ఐదు లక్షలు, పక్కా వ్యాపారంగా తయారైంది. కనుక, తల్లితండ్రులు తమ కుమారుని అమ్ముకుంటున్నారు. అమ్ముకున్నప్పుడు భార్యకు నీవు బానిసగాని యజమానివి కావు. ఆ డబ్బు ఎలా తీసుకుంటారు సిగ్గులేకుండా! అమ్మాయికి అమ్ముడుపోయావు నీవు. కనక, విద్యార్థులారా! మీరు చక్కగా గుర్తించాలి. వరకట్నంలో మీరు ఏమాత్రం ప్రవేశించకండి. నోరు తెరచికూడా అడగకూడదు. ఒకవేళ వారి తల్లిదండ్రులు వారి బిడ్డకిస్తే యిచ్చుకోమనండి. తప్పులేదు. ఇంకా కొంతమంది కిరాతకులైన విద్యార్థులుకూడా తయారౌతున్నారు. ఇంత డబ్బు యిస్తామని వారు ఒప్పుకుంటారు. ఏ వెయ్యో రెండువేలో తక్కువైతే కారెక్కి వెనుకకు వస్తుంటాడు పరికిపంద. ఇది విద్యయొక్క లక్షణమా? ఇరవై సంవత్సరములు పెంచి పెద్ద చేసిన, కన్న తల్లిదండ్రులను, తోబుట్టువులను, సర్వమునూ వదిలిపెట్టి కొత్తవాడై నిన్ను నమ్మి నీవెంట వస్తుంటే నీవే ఆమెకు ద్రోహం చేయటమా? ఆ తల్లిదండ్రులను వదలి, అక్కచెల్లెండ్రను వదలి, అన్నదమ్ములను వదలి, కొత్తవాడివైన నీతో వచ్చినప్పుడు ఎన్నివిధాల నీవు సంరక్షించాలి. ఎన్నివిధాల ఆమెను సంతోషపెట్టాలి. కాని, ఈనాటి విద్యార్థులు మగవారు మరింత ఏడిపిస్తున్నారు ఆడపిల్లలను. వారికెప్పుడు ధనము అవసరమో అప్పుడు పుట్టింటికి పంపిస్తారు, తీసుకొని రమ్మని. వీడో పెద్ద బెగ్గర్. ఇలాంటివాటిలో మన విద్యార్థులు ఏమాత్రం ప్రవేశించకూడదు. ఇలాంటివన్నీ చిన్నవయస్సునుండియే పిల్లలకు బోధించాలి. ధనం ప్రధానంకాదు. గుణము ప్రధానము. కనుక, నీవు ధనంతో గుణాన్ని కొనుక్కోవద్దు. ధనంతో కృష్ణుని కొనుక్కుంటే ఆ కృష్ణుడు తన దగ్గరే వుంటాడని ఆ సత్యభామ ప్లాను వేసింది. ఆ సత్యభామ వేషంలో చక్కగా ఏక్ట్ చేసిన జమున ఇక్కడికి వచ్చింది. ఆమె దగ్గర శమంతకమణి వుంది. కావలసినంత ధనము వుంది. కృష్ణుని నేను కొనుక్కుంటానని ఉన్న ధనమంతా పెట్టింది. కాని, కించిత్తైనా కృష్ణుడు కదలలేదు. భగవంతుడు ధనానికి లొంగుతాడా! ఎప్పటికీ లొంగడనే సత్యాన్ని లోకానికి సత్యభామ చాటింది. కట్టకడపటికేమైంది? రుక్మిణి వచ్చింది. తాను పూజ చేసుకుంటూ ఒక తులసి దళాన్ని చేతిలో పట్టుకుని వచ్చింది. 'నారదా! కృష్ణరూపమునకు కృష్ణనామమే సరియైన తూకము' అంది. నామము రూపాన్ని చూపిస్తుంది. రూపము నామాన్ని స్మరిస్తుంది. ఈ రెండింటికీ సరియైన తూకం అదొక్కటే. రూపానికి నామము, నామానికి రూపము. కనుక, 'కృష్ణా!' అంది పాపం రుక్మిణి. బ్రహ్మ మానస పుత్రుడు, చక్కని చదువులు చదివినవాడు నారదుడు. అతడు అందరినీ మోసము చేయగలడుగానీ తనను ఎవరూ మోసం చేయటానికి వీలుకాదు. 'అమ్మా! సాకార కృష్ణునికి నిరాకార నామం చెప్తే నాకేమి ఆదాయం? కనుక, నీవు కూడా సాకారానకి తగిన విలువ యివ్వాలి' అన్నాడు. ఆ తుసిదళం తీసుకుంది రుక్మిణి

పత్రమో పుష్పమో ఫలమో తోయమో
భక్తి కలిగిన వానికి వశుడవగుదువేని
నీవు ఈ తులసీ దళమునకు తూగుదువుగాక!

పత్రమంటే ఏమిటి? దేహమే పత్రము. పుష్పమంటే ఏమిటి? హృదయమే పుష్పము. ఫలమనగా ఏమిటి? మనస్సే ఫలము. తోయమనగా ఏమిటి? ఆనంద బాష్పములే తోయము. ఈ నాల్గింటికీ నీవు తూగుతావు కదా! 'కృష్ణా!' అని తులసీదళం వేసింది. కృష్ణా అనే నామం కృష్ణునికి సరియైన తూకం వచ్చింది. ఈ తులసీదళం extra weight అయిపోయింది. ఆవిధంగా భగవంతుడు భక్తికి తూగుతాడుగానీ ధనమునకు తూగడు. కనుక, నీ హృదయాన్ని పవిత్రంగా పెట్టుకో. సరియైన ప్రేమతో నింపుకో. ఈ నింపుకున్న ప్రేమను పదిమందికీ పంచు, నీవు ఆనందించు. ఇతరులకు ఆనందం అందించు. ఇది నీయొక్క కర్తవ్యం.

ఏదో ఒకటి తీసుకొని యింకొకటి అందిస్తాడు. కనుక, భగవంతుడు కూడా అంతే. ఏదో ఒక ఆనంద బాష్పాన్ని అతనికందిస్తే తప్పకుండా అనంత ఫలితాన్ని అందిస్తాడు. కుచేలుడు ఏమిచ్చాడు? పిడికెడు అటుకులిచ్చాడు. బహుళభాగ్యాన్ని అందించాడు భగవంతుడు. రుక్మిణి ఏమిచ్చింది? తులసి దళమును యిచ్చింది. దానికి వశుడైపోయాడు. భగవంతునికి ప్రేమతత్త్వాన్ని యివ్వాలి, ప్రేమతత్త్వాన్ని పుచ్చుకోవాలి. భగవంతునికి ఏమీ అక్కరలేదు. ఏమీ ఆశించడు. ఒక్కటి మాత్రం ఆశిస్తాడు.

నీ ప్రోపరిటీ కాదు. అది భగవంతుని ప్రోపరిటీ. Love is God. పిల్లలకు టీచర్స్ చెప్పాలి.

start the day with love
fill the day with love
spend the day with love
end the day with love
this is the way to god.

ఇది చెప్పాలి. పిల్లలలోపల పోట్లాటలు రాకూడదు. ఒకరితో ఒకరు ద్వేషాన్ని పెంచుకోకూడదు. ఆవిధమైన దివ్యమైన, నవ్యమైన, పవిత్రమైన భావాలను పిల్లల హృదయాలకు అందించాలి.

అందించే మీరుకూడను ఆచరించాలి. ఆచరించకుండా వారికి అందిస్తుంటే, ఈ కాలపు పిల్లలు చాలా తెలివైనవారు, 'బ్రదర్ టీచరు చెబుతున్నాడు తాను ఆచరింఛటం లేదు' అని చెబుతాడు. టీచర్స్ అతి జాగ్రత్తగా వుండాలి. పిల్లలలో ఈ భావాలుంటే మీరు చెప్పి ప్రయోజనం వుండదు. bookish knowledge గా మారిపోతుంది. superficial knowledge గా అయిపోతుంది. practial knowledge గా రావాలి. అధ్యాపకులు, పిల్లలకు ఏమి చెబుతున్నారో అది పాటించాలి. మీరు పిల్లలకు పోట్లాడకూడదని చెబుతూ మీలోమీరు పోట్లాడుకుంటే, నాన్న సిగరెట్టు తాగుతూ కుమారునకు, 'ఒరేయ్! సిగరెట్టు తాగకూడదు, చెడ్డది' అని చెబుతే వాడేమంటాడు? 'చెడ్డదని తెలిసి నీవే తాగుతుంటే నేను తాగితే తప్పేమిటి?' అంటాడు. పిల్లలు చెడిపోటానికి మూలకారణాలు యివే. టీచర్స్ తమ పిల్లలకు తాము చెప్పరు. మీటింగులకుపోయి, 'పిల్లలకు చెడ్డ బుక్కులు అందించకూడదు, పాడైపోతున్నారు. శీలం లేకుండా పోతున్నాది' అని చెబుతారు. నీవు ఆచరించు అప్పుడు నీకు చెప్పటానికి అధికారము వస్తుంది. మొదట ఇంటిలో పిల్లలను చక్కచేసుకో. పిల్లలు చాలా జాగ్రత్తగా వుండేటువంటివారు. అంటే వారి బుద్ధులు షార్ప్‌గా వుంటుంటాయి. చాలా knowledge వుంటున్నాది. వారు నాలెడ్జిని కిల్ చేస్తున్నారు. వేదాంతములో 4 steps పెట్టారు. 1st step knowledge, 2nd step skill, 3rd step balance, 4th step insight.

మొట్టమొదట knowledge. knowledge ని skill చేయి. balance సక్రమంగా వస్తుంది. కాని, దురదృష్టవశాత్తు ఈనాటి పిల్లలంతా bad look, bad hearing, bad thoughts, bad actions ఇవి చేయటం వలన కిల్ అయిపోతున్నాది. నారెడ్జి అంతా పాడుచేసుకుంటున్నారు. కనుకనే బ్యాలెన్స్ తప్పిపోతున్నాది. బ్యాలెన్స్ తప్పిపోతే జీవితములో చాలా కష్టనష్టములకు గురైపోతారు. బ్యాలెన్స్ వుంటే జీవితము బ్యాలెన్స్‌లో వుంటుంది. మనము అన్నింటిని ఎదుర్కొనుటకు సిద్ధముగా వుండాలి. life is challange, meet it. life is a game, play it. ఫుట్‌బాల్ ఆటలో అటువైపున ఇటువైపున రెండు గోల్స్ వున్నాయి. ఈ గోల్స్‌కు రెండు లిమిట్స్ వున్నాయి. ఆ లిమిట్స్‌లోపల బాల్ పోతే గోల్ అవుతుంది. ఆ రెండు లిమిట్స్ దాటిపోతే అవుట్ అయిపోతుంది. ఎవరెవరు ఆడుతున్నారు ఈ ఫుట్‌బాల్? సత్యము, ధర్మము, ప్రేమ, శాంతి, అహింసలు ఒకవైపు కామక్రోధలోభమదమాత్సర్యం ఈ ఆరూ మరొకవైపున వున్నారు. ఇరువురూ కాళ్ళతో కొట్టేస్తున్నారు. మంచి చెడ్డ. ఎంతవరకు దీన్ని కొడతారు? దానిలో గాలి వున్నంతవరకు కొడతారు. అయిపోతే చేతులతో ఎత్తుకుంటారు. ఆ గాలి అహంకారము. ఆ అహంకారము వుంటే అందరూ కాళ్ళతోనే కొడతారు. మర్యాద చూడరు. అహంకారము పోవాలి. దీనినే వినయము అన్నారు. ఆ వినయము ఎట్లా వుండాలి? తల ఆడించి నమస్కారం అంటే చాలదు. అహంకారము, మమకారము, క్రోధము, రహితమైన మనస్సు. అహంకార రహితమైన మనస్సు, మమకార రహితమైన మనస్సు అదే నిజమైన వినయము. ఈనాడు అహంఖారము అధికంగా వుంటున్నాది. లోకములో వున్న అన్ని కారములకంటె అహంకారము చాలా కారం. ఈ కారము గుంటూరు, బెజవాడ ఆవకాయలోకూడా అంత కారము వుండదు. ఈ కారమును నీవు భుజిస్తివా నీరు త్రాగవలసి వస్తుంది. ఏమిటి ఆ నీరు లోకవాంచలనే నీరు త్రాగవలసి వస్తుంది. దానివల్ల ఆరోగ్యము చెడిపోతుంది. మొట్టమొదట తల్లిదండ్రులను గౌరవించాలి. మాతృదేవోభవ, పితృదేవోభవ. దేవుని ప్రత్యేకంగా వెతకనక్కరలేదు. ఎటువంటివారికైనా తల్లికి మించిన దైవము లేదు. కనుకనే, శంకరులు చెప్పారు, 'దుర్మార్గులైన పుత్రులు, పుత్రికలు వున్నారుగాని దుర్మార్గురాలైన తల్లి లేదు' అని. ప్రాణసమానంగా చూచి, ప్రాణానికి ప్రాణంగా చూచి, పోషించిన తల్లి కంటినీరు నింపుతే రేపటి దినము నీ బిడ్డలు నీ కంటినీరు నింపరా! ఈ రియాక్షన్, రీసౌండ్, రిఫ్లక్షన్ తప్పునది కాదు. మొట్టమొదటనే మనం జాగ్రత్తగా వుంటుండాలి. ఎక్కువ పరిచయం పెట్టుకోకుండా, దుర్భావములు లేకుండా, దుస్సంగమును చేరకుండామంచిని చూడు, మంచిని చేయి, మంచిని అనుభవించు. ఇదియే నిజమైన మానవత్వానికి తగిన విలువ.

(ప్రేమ ముదిత మనసె కహో రామరామరాం...)

(1994 జూలై 22వ తేదీ గురుపూర్ణిమ సందర్భముగా బృందావనములో భగవాన్‌బాబావారి దివ్యోపన్యాసం)